క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్‌కేపురం ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ లక్ష్మీ గణపతి, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్వానం అందజేత



ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఆలయ చైర్మన్

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీ చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ శుక్రవారం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వానం అందించారు. అలాగే ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరగా, అందుకు ఆయన తన వంతు సహకారం అందిజేస్తామని చెప్పారన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: ప్రజాయుద్ధ నౌక, ఉద్యమకారుడు గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో గద్దర్ జయంతి వేడుకల సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ.. గద్దర్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, జానకిరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సద్గుణాచారి

హుడాకాంప్లెక్స్: బహుళ ఔషధ చికిత్స, సరైన అవగాహనతో కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని విశ్రాంత పారామెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సద్గుణాచారి చెప్పారు. కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సద్గుణాచారి మాట్లాడుతూ.. ఈ వ్యాధి మొదట స్పర్శ లేని మచ్చలతో ప్రారంభమవుతుందని, కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత పారామెడికల్ అధికారి సతీష్, సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి తోడ్పాటు

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి



కాలనీ బోర్డును ఆవిష్కరిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట జిల్లెలగూడలోని జెనిగె అడివమ్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నామకరణం బోర్డును శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉండి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న చిన్నారులు



ప్లేట్లు పట్టుకొస్తున్న విద్యార్థినులు

అన్నం తినాలంటే.. ఆగాలి!

- వీఎం హోంలో డైనింగ్ టేబుళ్ల కొరత
- మూడు పూటలా విడతల వారీగా వడ్డింపు

హుడాకాంప్లెక్స్: విలువైన భూములు ఉన్నాయి. నిధులకు కొదవ లేదు. కానీ అధికారుల అలసత్వంతో అనాథ పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. విక్టోరియా మోమోరియల్ స్కూల్‌లో విద్యార్థుల నిష్పత్తి మేరకు డైనింగ్ టేబుళ్లు లేకపోవడంతో ఉదయం,మధ్యాహ్నం, రాత్రి వేళలో షిఫ్ట్‌ల వారీగా భోజనం వడ్డిస్తున్నారు. ఆకలితో ఉన్న పిల్లలు ప్లేట్లు చేతిలో పట్టుకుని గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోంది.

అనేక మార్గాల్లో ఆదాయం

అనాథ పిల్లల కోసం ప్రభుత్వం సరూర్‌నగర్‌లో 67 ఎకరాల విస్తీర్ణంలో విక్టోరియా మోమోరియల్ స్కూల్(వీఎం హోం)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయిస్తుంది. బీజేఆర్ భవనం, రిలయన్స్ పెట్రోల్ బంక్, రైతుబజార్ ద్వారా నెలవారి అద్దెల రూపంలో భారీగానే ఆదాయం సమకూరుతుంది. దీనికి తోడు దాతలు కూడా ఆర్థిక సహాయం అందిస్తుంటారు. సినిమా షూటింగ్‌లకు అద్దెకు ఇవ్వడం ద్వారా మరిన్ని వనరులు సమకూరుతాయి. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందకుండా పోతున్నాయి.



డైనింగ్ హాల్ ఎదుట భోజనం కోసం పడిగాపులు

కడుపు నిండాలంటే నిలబడాలి

ప్రస్తుతం ఈ వసతి గృహంలో 900 మంది అనాథ పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి చదువుతో పాటు వసతి కూడా కల్పిస్తున్నారు. బాల, బాలికల కోసం వేర్వేరు వసతి గృహాలు ఏర్పాటు చేశారు. అయితే వారి నిష్పత్తి మేరకు డైనింగ్ హాల్ నిర్మించక పోవడంతో షిఫ్ట్‌ల వారీగా పిల్లలకు భోజనం వడ్డించాల్సి వస్తోంది. అప్పటికే ఆకలితో అలమటించే చిన్నారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ భోజనం కోసం క్యూ కట్టాల్సి వస్తుండటంతో అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

శాశ్వత ప్రిన్సిపాల్ లేక..

కేవలం ఈ డైనింగ్ హాల్ వద్దే కాదు. మరుగుదొడ్ల విషయంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం అవినీతి కేసులో రెగ్యులర్ ప్రిన్సిపాల్ అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత మరో ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ లేకపోవడంలో కీలక నిర్ణయాలు తీసుకోలేని దుస్థితి నెలకొంది. మౌలిక సదుపాయాలు మెరుగుపడటం లేదు.

ధర్మ పరిరక్షణే లక్ష్యం

వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి రాజు

మహేశ్వరం: హైందవ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ నిరంతరం పని చేస్తుందని సంఘం జిల్లా కార్యదర్శి మండల రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి గ్రామ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూవుల హక్కుల కోసం, వారికి అన్యాయం జరిగితే వారి పక్షాన నిలబడి కొట్లాడుతామన్నారు. మత మార్పిడిలను అడ్డుకుంటామన్నారు. అంతకు ముందు అమీర్‌పేట్ గ్రామ విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని నియమించారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా కావలి వేణు, ఉపాధ్యాక్షులుగా మంగళి సందీప్, చాకలి రాజేష్, కార్యదర్శి కరణ్‌కోట్ సుమన్‌రాజ్, సహాయ కార్యదర్శిగా కడల హేమంత్, భజరంగ్‌దళ్ సంయోజక్ కుమ్మరి వర్ధన్, సహ ప్రయోజక్ సంతోష్, గోరక్షక్ ప్రముఖ్ కొండపల్లి స్వామి, సత్సంగ్ ప్రముఖ్ శ్రీకిరణ్, సహ గోరక్షక్ ప్రముఖ్ బీర్ల రాఘవేందర్ తదితరులు ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో మహేశ్వరం మండల ప్రఖండ అధ్యక్షుడు కడల మహేశ్, కార్యదర్శి రాఘవేందర్, సహ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



అమీర్‌పేట్ వీహెచ్‌పీ నూతన కార్యవర్గం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వారంతా ఇబ్రహీంపట్నం పరిధిలోని ఓ రిసార్ట్‌లో సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకుని సంతోషంగా గడిపారు. అలనాటి ఉపాధ్యాయులు జంగయ్య, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, వెంకట్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, రాజు తదితరులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం వినోబా నగర్‌లో ఉన్న మాత పితా వృద్ధాశ్రమంతో పాటు స్ఫూర్తి ఫౌండేషన్‌లోని దివ్యాంగ అనాథలకు రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ జైపాల్‌రెడ్డి, డి.రాంచందర్, కె.రాములు, బాలనరసింహ, అరవింద్‌రెడ్డి, పవన్‌కుమార్, దేవదాసు, జంగయ్య, అమృత, కిరణ్, అలివేలు, కవిత, సుమలత, జయంతి, ప్రమోదలక్ష్మి, రజిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



గురువులను సన్మానించి జ్ఞాపికలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జాతరకు ఏర్పాట్లు చేయండి



గరిగుట్ట పెద్దమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహేశ్వరం: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి జాతరకు మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడవిలో జరిగే ఈ జాతరకు వేలాది మంది భక్తులు విచ్చేయనున్న దృష్ట్యా రహదారిపై ఉన్న గోతులను మొరంతో నింపాలన్నారు. ఆలయం వద్ద నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్ బాబా, సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ యాదగిరి, నాయకులు షేక్ జహంగీరుద్దీన్, యూసుఫ్ ఖాద్రీ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదల్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన గద్దగూటి హరికృష్ణ ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పని చేసిన ప్రతి నాయకుడికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని కోరారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం హరికృష్ణముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, నాయకులు ఈశ్వర్‌ముదిరాజ్, ఇజ్రాయేల్, సమత, లాజర్, రాజునాయక్, యాదయ్య, యాదయ్య, బాల్‌రాజ్, రాజు, బాల్‌రాజ్, ప్రవీణ్, యాదయ్య, వెంకటేశ్‌గౌడ్, నారాయణ, ఇర్షాద్, మహేందర్‌రెడ్డి, జంగయ్య, సేవ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం కేఎల్లార్ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఆస్పత్రిలో రోగులకు ఉపయోగపడే పరికరాలను అందజేశానని భవిష్యత్తులో మరిన్ని ఆస్పత్రికి అందజేస్తానని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో రెండు పెద్ద గేట్లను కేఎల్లార్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. గేట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూపరింటెండెంట్‌ను కోరారు. కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అమీర్ సద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.



హరికృష్ణ ముదిరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

మీర్‌పేట మాజీ మేయర్‌కు సత్కారం

మీర్‌పేట: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్‌లతో శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ మాజీ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌ను కేటీఆర్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జగదీశ్వర్‌రెడ్డిలు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మాజీ మేయర్ దుర్గ మాట్లాడుతూ.. మేయర్‌గా మీర్‌పేట ప్రాంతానికి సేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన బీఆర్‌ఎస్ అధిష్టానం, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్‌ను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు.



మాజీ మేయర్ దుర్గ దంపతులను సత్కరిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సత్యవతిరాథోడ్

వాసవిమాత ఆలయంలో పూజలు



ఆత్మార్పణ దినోత్సవంలో నాయకులు

మీర్‌పేట: జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆలయ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 500 మంది మహిళలతో ఆలయంలో కుంకుమార్చనతో పాటు హోమం, అభిషేకం చేశారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి కిరణ్ గుప్తాలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మీర్‌పేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా, కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు.


కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలి



ఎంపీడీఓ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మహేశ్వరం: ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీలో లబ్ధిదారుల ఎంపికలో తమకు మినహాయింపు ఇవ్వాలని మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. నిత్యం గ్రామాల్లో విధి నిర్వహణలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ఇవ్వడంతో ప్రజల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మూడు, నాలుగు గ్రామ పంచాయతీలను కలిసి మండల స్థాయి అధికారులకు నియమించి సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్నారు. ఎంపీడీఓ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్, జావీద్, రాము, పరమేష్, శ్రీనివాస్, కృష్ణయ్య, సుజాత, లక్ష్మి, రాజు, పుష్ప, దివాకర్, కల్పన, జానయ్య, శివ, జైదీప్, రిషీక, జంగయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియని, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తున్నామని వెల్లడించారు. అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ సభ్యులు బాలాజీసింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాజీ సభ్యురాలు అనిత విజయ్, వైస్‌ఎంపీపీ అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ డైరెక్టర్ శ్రీశైలం, ఎంపీడీఓ మాధవి, తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో వ్యర్థాల కుప్పలు

మీర్‌పేట: చెరువులను కప్పేసిన గుర్రపుడెక్క తొలగింపునకు ముహూర్తమెప్పుడు...? ఆహ్లాదం పంచేందుకు కోట్లాది రూపాయలతో మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన, మంత్రాల చెరువులను అభివృద్ధి చేశారు. కొన్ని నెలలుగా రెండు చెరువుల్లో నీరు కనిపించనంతగా గుర్రపుడెక్క పెరిగినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని సమీప కాలనీలవాసులు పేర్కొంటున్నారు. గతంలో గుర్రపుడెక్క వచ్చిన వెంటనే యంత్రాలు, డ్రోన్ సహాయంతో తొలగించేవారని, దాదాపు సంవత్సరం నుంచి కొంచెం కొంచెంగా చెరువులను పూర్తిగా ఆవహించినప్పటికీ కార్పొరేషన్ యంత్రాంగంలో తొలగించాలన్న ఆలోచన కూడా రావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. గుర్రపుడెక్కకు వ్యర్థాలు తోడవ్వడంతో దుర్వాసన వెలువడి, దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాకర్స్, పరిసర కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చందన చెరువును కప్పేసిన గుర్రపుడెక్క



మంత్రాల చెరువు ఇలా...